క్లుప్తంగా

అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టండి



బురాన్‌దొడ్డి హైస్కూల్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. మూడు అదనపు తరగతి గదులు మంజూరవ్వగా బేస్ మట్టం పనులు పూర్తి అయ్యాయని, అదేవిధంగా వంటగది నిర్మాణం పూర్తి అయ్యిందని, మరుగుదొడ్ల నిర్మాణాలు నిర్మాణ దశలో ఉన్నాయని హెచ్‌ఎం నిర్మళ వసంత కుమారి ఏఈకి తెలిపారు. పనులను సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు కృషి చేయాలని ఆయన సూచించారు.

ఆర్బీకే తనిఖీ



సంగాల ఆర్బీకేలో రైతులకు ఎరువు ప్యాకెట్లను అందజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల ఆర్బీకేను మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆర్బీకేలలో రైతులకు అసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు ఎరువుల ప్యాకెట్లను అందజేశారు కార్యక్రమంలో వీఏఏ సంధ్య, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూముల సర్వేను సద్వినియోగం చేసుకోండి



కంబదహాల్‌లో భూముల రీ సర్వేపై గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. రెండవ విడత సర్వేకు ఎంపికైన మండల పరిధిలోని కంబదహాల్, కొండాపురం గ్రామాలలో మంగళవారం గ్రామ సభలను నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భావితరాలకు ఎలాంటి సమస్యలు ఉండవని, ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ



మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో నూతనంగా మంజూరైన 15 పింఛన్లను ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ అజాంఖాన్ మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

దిగువపాడు ఉప సర్పంచ్‌గా వడ్డె వెంకటలక్ష్మి



వడ్డె వెంకటలక్ష్మి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల ఆఫీసర్ రవికిశోర్

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామ ఉప సర్పంచ్‌గా వడ్డె వెంకటలక్ష్మి (వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్టేజ్–2 ఆఫీసర్ (కల్లూరు ఈఓఆర్డీ) రవికిశోర్ వెల్లడించారు. సోమవారం కోరం లేకపోవడంతో వాయిదా పడిన విషయం విధితమే. మంగళవారం దిగువపాడు సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. 8వ వార్డు సభ్యురాలు వడ్డె వెంకటలక్ష్మి ఉప సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ధ్రువీకరణ పత్రం అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఓర్వకల్లు ఎంఆర్‌సీలో ఎంఈఓను సన్మానిస్తున్న దృశ్యం



లక్ష్మీపురం కేజీబీవీలో రాధాకృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

ఓర్వకల్లు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మండల రిసోర్స్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–1 సునంద, ఎంఈఓ–2 ఓంకార్‌యాదవ్‌లను పూలమాలలతో సన్మానించారు. మండల స్థాయిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు ఇస్మాయిల్, క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. లొద్దిపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయురాలు శారదమ్మలను పీఎంసీ చైర్మన్ వెంకటస్వామి సన్మానించారు.

కల్లూరు మండలంలో..

కల్లూరు: మండలంలోని అర్బన్, గ్రామీణ పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీపురం కేజీబీవీలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గడివేముల మండలంలో ..

గడివేముల: మండలంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. గడివేముల ఎంఈఓ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈఓ–2 విమలా వసుంధరాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకురావాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, 'కుడా' చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోడుమూరులోని కేవీఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఆ దశలో చేసుకునే దిశా నిర్దేశం ద్వారానే ఎదుగుదల, జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండడంతో పాటు, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, మాజీ గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ రవిబాబు, శేఖర్, అధ్యాపకులు విజయ్‌కుమార్, వీరేష్, బజారి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం దివంగత రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడులు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్ర పటాలకు పూలల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, అధ్యాపకులు కోటేశ్వరి, మాధవీలత, శాంతి, ప్రియ, నరసింహులు, శివారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సి.బెళగల్ స్పెషల్ స్కూల్‌లో రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయిని సరోజ



కంబదహాల్ మెయిన్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళ్లలర్పిస్తున్న టీచర్లు



మారందొడ్డి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం



కొత్తకోట జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధ్యాయులకు అభినందనలు

మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. మారందొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉంటూ పదోన్నతిపై మండలానికి ఎంఈఓ – 2గా ఎంపికైన ఆదామ్‌బాష జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అదే విధంగా పోలకల్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రమ, పోలకల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న మునిస్వామి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కర్నూలు ఆర్డీఓ హరి ప్రసాద్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరమణ అధ్యక్షతన ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడానికి బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారన్నారు. ఆదే సమయంలో రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు కూడా బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకుని ఇంటింటికి తిరుగుతూ వివరాలు తెలపాలన్నారు. డబల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి వివరాలను బీఎల్‌ఓలకు వివరించి సహకరించాలన్నారు. ఈ నెల 25 నాటికి ఇంటింటికీ తిరిగే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆర్డీఓ తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, ఎల్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు గజేంద్ర గోపాల్, సీపీఎం నాయకుడు మోహన్ పాల్గొన్నారు.

సి.బెళగల్: ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని, పొరపాట్లకు ఏ మాత్రం తావివ్వొదని డ్వామా ఏపీడీ అల్లిపీర సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను ఏపీడీ పరిశీలించారు. ఓటరు జాబితా వెరిఫికేషన్ తీరుపై తహసీల్దార్ శేషఫణి ఏపీడీ చర్చించారు. మండల వ్యాప్తంగా 49 పోలింగ్ కేంద్రాలలో 899 మంది మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను తొలగించినట్లు మండల గణాంకాధికారి (ఏఎస్‌ఓ) ఆదినారాయణ ఏపీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించేప్పుడు అన్నివిధాలుగా విచారించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదులపై సమగ్రంగా విచారించాలని ఆదేశించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

• ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కొత్తూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. నీటి సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యేను కోరగా ప్రతి పాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

గడప గడపతో ప్రజా సమస్యల పరిష్కారం

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభ్వుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడి గడప వద్దకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. సుపరిపాలనను అందిస్తున్న జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించి మరోమారు గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు మధు, నాగేష్, రాఘవేంద్ర, సులేమాన్, మిన్నెల్ల, మాదన్న, ఉసేన్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఈఓఆర్డీ సందీప్ తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు పరిశీలించారు. పేదలకు అందుతున్న సేవలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సచివాలయ భవన నిర్మాణ పనులను ఈఓఆర్డీ పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్ అసిస్టెంట్ ఇమ్మానియేల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, వీఆర్వో రంగముని తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని మంగళవారం స్థానిక రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పెంచిన ధరలు తగ్గించి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రవి, దానమన్న, సుంకన్న, మధు, మద్దిలేటి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తుందని, మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తుందని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. మంగళవారం కోడుమూరులోని శ్రీరాములవారి ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో సుమారు 200మందికి ఉచితంగా గుండె, బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ దివంగత డా.వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ కార్యక్రమం ద్వారా ప్రతి పేదవాడికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనూ నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారని వివరించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సీఈఓ సునీల్, కార్డియాలజిస్ట్ నాగేంద్రప్రసాద్, ఎస్ఎస్‌కె సమాజ్ సభ్యులు నాగరాజు, రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, వీరన్న, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

• కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



ఎమ్మెల్యే సుధాకర్‌కు బొకే అందజేస్తున్న కె నాగలాపురం సుంకులమ్మ దేవస్థానం చైర్‌పర్సన్ ఉమామహేశ్వరమ్మ, తదితరులు

కర్నూలు (న్యూటౌన్): గూడూరు మండలం కె నాగలాపురంలో వెలసిన సుంకులమ్మ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆలయ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరమ్మకు సూచించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ సుధాకర్, సతీమణి విజయలలితను కె నాగలాపురం దేవస్థానం చైర్‌పర్సన్ ఎల్ ఉమామహేశ్వరమ్మ, వైస్ చైర్మన్ లక్ష్మన్న, కమిటీ సభ్యులు మాధవి, సచివాలయ కన్వీనర్లు నరసింహారెడ్డి, జ్యోతమ్మ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులుగా తమకు అవకాశం ఇచ్చినందుకు ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

కర్నూలు(టౌన్): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న నలుగురిని నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 2న నాగేంద్రనగర్‌లో తాళం వేసిన ఇంట్లో రూ.50 వేలు నగదు, జత కమ్మలు, జత మాటీలు చోరీకి గురయ్యాయి. ఇంటి యజమాని చింతల తిరుపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాల్గవ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. మంగళవారం కోడుమూరు రోడ్డులోని హోసన్నా మందిరం వద్ద అనుమానంగా తచ్చాడుతున్న గజ్జల వంశీ (వీకర్‌సెక్షన్ కాలనీ), షేక్ మహమ్మద్ (విజయకృష్ణ నగర్), ప్రకాష్ (ఎస్సీ కాలనీ, జి.శింగవరం), ఎం.వంశీ (అశోక్ నగర్)లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించా రు. వారి వద్ద నుంచి రూ.40 వేలు నగదు, తులం బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



ఉషశ్రీ (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) ఉషశ్రీ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆమె తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కర్నూలులో నివాసముంటున్న ఉషశ్రీ ప్రతిరోజులాగే సోమవారం విధి నిర్వహణకు బయలుదేరింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెంది కుటుంబ సభ్యులు పలు చోట్ల వాకబు చేశారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయాల్లో సర్వీసులు పెంచాలి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందించే సర్వీసులను పెంచాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం కృష్ణగిరి గ్రామ సచివాలయాన్ని, మండలంలోని మీ–సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలో రోజుకు 20 నుంచి 30 సర్వీసులు జరిగేలా ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ సేవలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యాప్ ద్వారా అర్హులైన వారందరికీ రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం కృష్ణగిరి, ఎరుకలచెర్వు, చిట్యాల తదితర గ్రామాల్లోని మీ–సేవా కేంద్రాలను పరిశీలించారు. ఆయా సర్వీసులను నిర్దేశించిన మొత్తం కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం ప్రారంభం

కర్నూలు కల్చరల్: ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రారంభించినట్లు కర్నూలు – 1, 2 డిపోల మేనేజర్లు సర్దార్ హుస్సేన్ కె.సుధారాణి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కర్నూలు–లద్దగిరి, కర్నూలు– బేతంచెర్ల రూట్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికులు వారి టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా 1, 16 తేదీల్లో లక్కీ డిప్ ద్వారా డ్రా తీసి ఇద్దరికి ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కళలు సంస్కృతికి ప్రతిబింబాలు



కళాకారులను సన్మానిస్తున్న మేయర్ రామయ్య, తదితరులు



అలరించిన నృత్యం

కర్నూలు కల్చరల్: కళలు మన సంస్కృతికి ప్రతిబింబాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరగనున్న శాస్త్రీయ జానపద నృత్య ఉత్సవాలను మంగళవారం రాత్రి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న జానపద కళలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. తంజావూరు దక్షిణ మధ్య ప్రాంత సాంస్కృతిక సమన్వయకర్త బి.జగన్నాథం మాట్లాడుతూ దేశంలో ఏడు సాంస్కృతిక కేంద్రాలు ఉన్నాయన్నారు. దక్షిణ భారతానికి తంజావూరు కేంద్రంగా ఉందన్నారు. ఈ కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు ప్రజలకు మూడు రోజుల పాటు జానపద శాస్త్రీయ పౌరాణిక ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన యశోదా ఠాకూర్ కూచిపూడి నృత్యం, వరంగల్ ట్రైబల్ మాధురి నృత్యం, గద్వాల దాసరి రంగయ్య సింధు యక్షగానం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం కళాకారులను మేయర్ బీవై రామయ్యతో పాటు సమన్వయకర్త డి.జగన్నాథం, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు రంగయ్య, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య సత్కరించారు.

నేటి ప్రదర్శనలు..

రెండో రోజు బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మల్లిక కండలిచే అస్సాం శాస్త్రీయ నృత్యం సత్రియ, మహబూబ్ నగర్‌కు చెందిన శివ బృందం లంబాడి నృత్యం, నాగర్ కర్నూలుకు చెందిన శ్రీధర్ బృందం ఉగ్గకథలు ప్రదర్శితమవుతాయి.